


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
13-07-2025
పేజీలు: 02





# సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత

తెలుగు సినిమా గర్వించదగ్గ నటుల్లో అగ్రస్థానం దక్కించుకున్న కోట శ్రీనివాసరావు గారు ఆదివారం ఉదయం 4 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వయస్సు 83 సంవత్సరాలు. నాటక రంగం నుంచి వెండితెరకు వెళ్లిన కోట గారు, నాలుగు దశాబ్దాలకు పైగా సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 750కి పైగా చిత్రాల్లో నటించారు. ప్రతినాయక పాత్రలు నుంచి హాస్య పాత్రలు, లోతైన సామాజిక పాత్రల వరకు ఆయన చేసిన నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. 1978లో విడుదలైన 'ప్రాణం ఖరీదు'తో ఆయన సినీరంగ ప్రవేశం చేశారు. శివ, గాయం, శత్రువు, మనీ, అహ నా పెళ్లంట, బొమ్మరిల్లు, అతడు, లీడర్, రక్తచరిత్ర, ఎస్/ఓ సత్యమూర్తి, అత్తారింటికి దారేది వంటి అనేక చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకుల గుండెల్లో చెరిగిపోని ముద్ర వేసాయి. 2003లో తమిళ చిత్రమైన 'సామీ'తో తమిళ చిత్రసీమలో అడుగుపెట్టిన ఆయన, అక్కడ కూడా విలక్షణమైన ప్రతినాయకుడిగా పేరు సంపాదించారు. కృష్ణా జిల్లాలోని కంకిపాడు గ్రామంలో 1942, జూలై 10న జన్మించిన కోట గారు, చిన్ననాటినుంచి వైద్యవృత్తిపై ఆసక్తి కనబరిచారు. ఆయన తండ్రి సీతారామ అంజనేయులు ఒక వైద్యుడు. కానీ నటనపై ఉన్న మక్కువ ఆయనను రంగస్థలానికి దగ్గర చేసింది. బి.ఎస్‌సి పట్టా పొందిన తర్వాత స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూనే నాటకాల్లో నటిస్తుండేవారు. తన నటనా నైపుణ్యానికి గాను తొమ్మిది నంది అవార్డులు అందుకున్నారు. 2015లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారంను ప్రకటించింది. ఇది భారతీయ చిత్రసీమలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా నిలిచింది. ఆయన మృతి తెలుగు చిత్రసీమకు తీరని లోటు. కళానటుడిగా మాత్రమే కాక, విలక్షణమైన వ్యక్తిగా కూడా గుర్తుండిపోయే కోట శ్రీనివాసరావు గారు తెలుగు సినిమా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారు.






## మహాప్రస్థానంలో కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు

ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు (83) అంత్యక్రియలు ఈరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 83 ఏండ్ల వయసులో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.

## కోట శ్రీనివాసరావు మృతితో కన్నీరు పెట్టుకున్న బాబు మోహన్



కోట శ్రీనివాసరావు — బాబు మోహన్ కలసి దాదాపు 60కి పైగా సినిమాల్లో నటించారు. కోట గారి గంభీరమైన డైలాగ్ డెలివరీ, విలక్షణమైన హావభావాలు, మరోవైపు బాబు మోహన్ అమాయకపు మానరిజంతో కూడిన టైమింగ్ కామెడీ ప్రేక్షకులని కడుపుబ్బ నవ్వించేలా చేసేవి. దర్శకులు, నిర్మాతలు వీరిద్దరినీ తమ సినిమాల్లో తప్పకుండా తీసుకునే వారు. వీరి కామెడీ ట్రాక్స్ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాయి. తెరపై వారి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పని చేసేది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో వచ్చిన మామగారు సినిమాలో వీరి కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంది సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించిన ప్రేమ విజేత చిత్రంలో వీరి సంభాషణలు బాగా పాపులర్ అయ్యాయి. సీతారత్నం గారి అబ్బాయి సినిమాలో కామెడీ సన్నివేశాలు నవ్వుల పంట పండించాయి. అహ నా పెళ్ళంట చిత్రంలో బాబు మోహన్ కనిపించకపోయినప్పటికీ, కోట శ్రీనివాసరావు పోషించిన పిసినిగొట్టు లక్ష్మీపతి పాత్ర తెలుగు సినిమా కామెడీలో ఒక ఐకానిక్ క్యారెక్టర్‌గా నిలిచిపోయింది. కోట శ్రీనివాసరావు — బాబు మోహన్ జంట తెలుగు సినిమా హాస్యానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని అందించింది. ఇప్పుడు కోట తనని వదిలి వెళ్లారని తెలిసి భావోద్వేగానికి గురయ్యారు బాబు మోహన్. కోట మరణం బాధాకరం. నిన్న రాత్రి కూడా ఆయనతో మాట్లాడాను.కోట మరణ వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది అని కన్నీరు పెట్టుకున్నారు బాబు మోహన్. ఇక కోట మరణ వార్త తెలుసుకున్న చాలా మంది సినిమా ప్రముఖులు షూటింగ్ క్యాన్సిల్ చేసుకొని ఆయనకు నివాళులు అర్పించేందుకు హైదరాబాద్‌కి వస్తున్నారు.











## కోట శ్రీనివాసరావు మృతిపై సంతాపం తెలిపిన సినీ ప్రముఖులు

కోటా మృతి పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

**పవన్ కళ్యాణ్**

ప్రముఖ సీనియర్ సినీ నటులు, మాజీ MLA, పద్మశ్రీ కోటా శ్రీనివాసరావు గారి మరణ వార్త తీవ్ర బాధాకరం. దాదాపు అనేక భారతీయ భాషల్లో 700 చిత్రాలకు పైగా విభిన్న పాత్రల్లో నటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కోటా గారు ఇకలేరు అనే వార్త సినీరంగానికి తీరని లోటు. ముఖ్యంగా అన్నయ్య చిరంజీవి గారితో కలిసి ప్రాణం ఖరీదు సినిమాతో ఒకేసారి సినీ ప్రయాణం మొదలుపెట్టారు. ఆయనతో కలిసి అర డజనుకు పైగా చిత్రాలలో నటించడం ఎప్పటికీ జ్ఞాపకంగా నిలిచిపోతుంది. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

**చిరంజీవి**

లెజెండరీ నటులు, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కోట శ్రీనివాస రావు గారు ఇక లేరనే వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. 'ప్రాణం ఖరీదు' చిత్రంతో ఆయన, నేను ఒకేసారి సినీ కెరీర్‌ను ప్రారంభించాం. ఆ తర్వాత వందలాది సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రనీ తన విలక్షణమైన, ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కామెడీ విలన్‌గా అయినా, సీరియస్ విలన్‌గా అయినా, సహాయక పాత్రలైనా.. ఆయన పోషించిన ప్రతి పాత్ర 'ఆయన మాత్రమే చేయగలడు' అన్నంత గొప్పగా నటించారు. ఇటీవలి కాలంలో ఆయన కుటుంబంలో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మానసికంగా ఎంతగానో కుంగదీసింది. కోట శ్రీనినివాస రావు గారి లాంటి నటుడి లోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రియులకి ఎన్నటికీ తీరనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకి, శ్రేయోభిలాషులకి, అభిమానులకి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**ఎన్టీఆర్**

కోట శ్రీనివాసరావు గారు... ఆ పేరే చాలు. ఎనలేని నటనా చాతుర్యం. ప్రతి పాత్రలో తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు ఆయన. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన, పంచుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**రామ్‌గోపాల్ వర్మ**

సినీ రంగంలో ఉన్న అతి కొద్దిమంది గొప్ప నటుల్లో కోట శ్రీనివాసరావు ఒకరనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన నటనతో నా సినిమాలు 'శివ', 'గాయం', 'మనీ', 'సర్కార్', 'రక్త చరిత్ర' మరింత ప్రభావవంతంగా వచ్చాయి. అది వెలకట్టలేనిది. కోట శ్రీనివాసరావు గారు మీరు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయి ఉండవచ్చు కానీ, మీ పాత్రలు బతికే ఉంటాయి.

**రవితేజ**

కోట శ్రీనివాసరావును చూస్తూ, ఆరాధిస్తూ.. ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగాను. ఆయన నా కుటుంబంలో వ్యక్తిలాంటి వారు. ఆయనతో కలిసి పని చేసిన క్షణాలు నాకు తీపి జ్ఞాపకాలు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

**బ్రహ్మానందం**

కోట శ్రీనివాసరావు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు. కోట శ్రీనివాసరావు నటరాజపుత్రులు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. దాదాపు 4 దశాబ్దాల పాటు మేము కలిసి పనిచేశామంటూ బ్రహ్మానందం కోట శ్రీనివాసరావుతో తమ దీర్ఘకాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.


**రాజమౌళి**

కోట శ్రీనివాసరావు గారి మరణ వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన ఒక అద్భుతమైన కళాకారుడు, ప్రతీ పాత్రకు ప్రాణం పోసిన గొప్ప నటుడు. తెరపై ఆయన ఉనికి నిజంగా ఎప్పటికీ భర్తీ చేయలేనిది. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి.

### ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన కోట: హరీశ్ రావు

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో, 750కు పైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన ఒక విలక్షణ నటుడని కొనియాడారు. చిరస్మరణీయమైన పాత్రల ద్వారా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన కోట మృతి సినీ లోకానికి, అభిమానులకు తీరని లోటని చెప్పారు. కోటా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## పాత్ర ఏదైనా సరే వంద శాతం న్యాయం చేసిన కోట.. వారు లేని లోటుని భర్తీ చేశాడు!



తెలుగు సినిమా రంగంలో తాను చేయని పాత్రలే లేనన్నట్టుగా, కోట శ్రీనివాసరావు నటించిన ప్రతి క్యారెక్టర్‌కి జీవం పోశారు. కమెడియన్‌గా , విలన్ గా, ఫాదర్, తాత, అవినీతి నేత ఇలా ఏ పాత్రనైనా అవలీలగా పోషించిన కోటా అనేక తరాల తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. దాదాపు 750కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన, తన ప్రతిభతో ప్రతి సినిమాలోనూ ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. తొలుత హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న కోట సినిమాలపై ఉన్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 1978లో 'ప్రాణం ఖరీదు' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన, 1983లో జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన 'అమరజీవి' లో నటించి మరింత గుర్తింపు పొందారు. ఆ తరువాత నుంచి వెనుదిరిగి చూడలేదు. ఎస్వీఆర్, రావు గోపాలరావు, కైకాల సత్యనారాయణ శకం ముగిసిన తర్వాత ఆ లోటును భర్తీ చేశారు కోట.

'డబ్బు ఖర్చు... సబ్బు ఖర్చు... నీళ్ల ఖర్చు' అనే డైలాగ్‌తో గుర్తొచ్చే లక్ష్మీపతి పాత్ర కోట నటనకు ఒక మైలురాయి. 'అహ నా పెళ్లంట సినిమాలో ఆయన పోషించిన పిసినారి పాత్ర ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచుతోంది. అదే తరహా పాత్రను ఆయన 'ఆమె', 'ఆ నలుగురు' వంటి చిత్రాల్లోనూ చేసి మెప్పించారు. 1985లో వచ్చిన 'ప్రతిఘటన' చిత్రంలో ఆయన పోషించిన మంత్రి కాశయ్య పాత్ర, కోటాని ఓ స్టార్ చేసింది. "నమస్తే తమ్మీ!" అంటూ తెలంగాణ యాసతో మాట్లాడే అవినీతి మంత్రిగా ఆయన నటన, ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయింది. 'గణేష్' చిత్రంలో "సాంబశివుడురా నా పేరు" అంటూ గుండుతో, లెన్స్‌తో, దుర్మార్గమైన ఆరోగ్య మంత్రిగా ఆయన చేసిన నటన చూస్తే గుండెల్లో వణుకు పుట్టేది. అదే తరహా సీరియస్ షేడ్స్‌ను ఆయన 'గాయం' సినిమాలో 'గద్దైతే నేను ఖండిస్తున్న' అనే డైలాగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇవన్నీ సోషల్ మీడియాలో ఇప్పటికీ వైరల్ అవుతూనే ఉంటాయి.

'హలో బ్రదర్'లో తాడిమట్టయ్య, 'మనీ మనీ'లో బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడే తికమక క్యారెక్టర్‌లు ప్రేక్షకులకు ఇప్పటికీ నవ్వులు తెస్తాయి. బాబు మోహన్‌తో కలిసి చేసిన కామెడీ సీన్లు మరొక లెవెల్ అన్నట్టుగా ఉంటాయి. కోట నటనలో హాస్యం ఒక్కటే కాదు... భావోద్వేగం కూడా ఉంటుంది. 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు'లో అల్లరి తాతగా, 'బొమ్మరిల్లు', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే', 'గబ్బర్ సింగ్' వంటి చిత్రాల్లో మధ్యతరగతి తండ్రిగా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులకు దగ్గరయ్యాయి.తెలుగు సినిమాలతోపాటు, ఇతర భాషల్లోనూ కోటా నటించి మంచి గుర్తింపు సంపాదించారు. మల్టీ డైమెన్షనల్ నటనతో ఆయన ఒక తెలుగు సినిమా చరిత్రలో నిలిచిపోయిన అధ్యాయంగా మిగిలారు. కోట మరణించిన కూడా ఆయన పోషించిన పాత్రలు, పలికించిన డైలాగులు, చూపించిన హావభావాలు తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చిరకాలం నిలిచిపోతాయి.



## తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి.. గాల్లోకి కాల్పులు జరిపిన గన్‌మెన్

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) కార్యాలయంపై దాడి జరిగింది. జాగృతి కార్యకర్తలు మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న కార్యాలయంపై శనివారం దాడి చేశారు. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి నాయకులు దాడి చేశారు. ఈ క్రమంలో మల్లన్న గన్‌మెన్ గాల్లోకి 5 రౌండ్లు కాల్పులు జరిపారు.. జాగృతి కార్యకర్తల దాడిలో మల్లన్న ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం అయింది. మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో దాడి జరిగినట్లు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను బయటకు పంపిస్తున్నారు. అయితే.. జాగృతి నేతల దాడి సమయంలో మల్లన్న ఆఫీస్ లోనే ఉన్నారు. కాగా.. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో మల్లన్న కవితపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌తో కవితకు ఏం సంబంధం..? మీకు మాకు ఏమైనా కంచం పొత్తా అంటూ మల్లన్న వ్యాఖ్యానించారు. మేం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే.. మీరు పండగచేసుకోవడం ఏంటో అర్థం కావడంలేదంటూ మల్లన్న ప్రసంగించారు. ఎమ్మెల్సీ మల్లన్న వ్యాఖ్యలపై భగ్గుమన్న జాగృతి శ్రేణులు.. ఆయన ఆఫీస్‌పై దాడి చేశారు. దీంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ కొనసాగుతోంది.



## కేరళ పాఠశాలలో బ్యాక్ బెంచ్‌కు బై బై

కేరళలోని కొల్లాం జిల్లా వలక్కమ్‌లోని రామవిలాసం వోకేషనల్ హైయ్యర్ సెకండరీ స్కూల్(ఆర్‌విఎస్ఎస్)లో విశిష్ట క్లాసురూం ఏర్పాట్లు ఉన్నాయి. ఈ పాఠశాలలో వెనుకసీటు విద్యార్థులు ఉండరు. తరగతి గదిలో ఒకే వరుసలో విద్యార్థులకు సీట్లు ఉంటాయి. దీనితో తాము బ్యాక్‌బెంచర్స్‌మనే భావన ఏ విద్యార్థికి కలగదు. అందరిని ఒకే వరుసలో కూర్చోబెట్టి చెప్పడం ఈ స్కూల్ ప్రత్యేకత. ఈ స్కూల్ పూర్వపు విద్యార్థిని జిపి నందన సివిల్ సర్వీసెస్ పరీక్షలలో జాతీయ స్థాయిలో 47వ ర్యాంకు, కేరళలో రెండో ర్యాంకు పొందింది. ఈ క్రమంలో ఈ స్కూల్ ఆవరణలో అభినందనల గర్వకారక కటౌట్ వెలిసి ఉంటుంది. ఆమె సాధించిన విజయం తెలిపే వివరణతో స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అవుతోంది. బ్యాక్‌బెంచ్ విద్యార్థులు ఉండరాదు, వెనుకబడితే వెనుకోనోయి అనే నినాదంతో , మలయాళం సినిమా స్తనార్థి శ్రీకుట్టన్ ఇతివృత్తం స్ఫూర్తితో స్కూల్‌లో ఈ ఒకే వరుస విద్యాబోధన ఏర్పాట్లు చేశారు. ఈ స్కూల్‌కు ముందే పంజాబ్‌లోని ఓ స్కూల్‌లో ఇటువంటి ఒకే వరుస సీట్ల ఏర్పాట్లతో క్లాసు రూంలను తెరిచారు. విద్యార్థులకు తమ చిత్రం ద్వారా ప్రయోజనం దక్కడం, విద్యాసంస్థలు స్ఫూర్తి పొందడం తమకు సంతోషకరం అని సినిమా ర్శకులు వినేష్ విశ్వనాథన్ తెలిపారు. తమ సినిమాలో ఈ విధమైన సీటింగ్ ఏర్పాట్లతో ఒకే ఒక్క సీన్ ఉందని గుర్తు చేశారు. తక్కువగా చదివే లేదా ప్రతిభలో వెనుకబడే విద్యార్థులు, ఆద్యంతం రాణించే విద్యార్థులనే తేడా మంచిది కాదని, ఇప్పటికే నార్వే , ఫిన్లాండ్‌లలో ఇటువంటి సింగిల్ వరుస ఏర్పాట్లతోనే విద్యాబోధన ఉందని, పలు ఉత్తమ ప్రమాణాలతో ఫలితాలు వెలువడుతున్నాయని దర్శకులు తెలిపారు. దీనిని తమ సినిమాలో అంతర్లీనంగా చెప్పామని, దీనిని అంతా పాటిస్తే తమకు మరేమి కావాలని ప్రశ్నించారు. ఇక ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహేంద్ర సింగిల్ కేరళ, పంజాబ్‌లలో క్లాసురూం విధానాన్ని స్వాగతించారు.

## లైంగికంగా వేధించిన పంతులు... కాలేజీలో పెట్రోల్ పోసుకొని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఓ విద్యార్థినిని టీచర్ లైంగికంగా వేధించడంతో ఆమె కాలేజీ ఆవరణంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ సంఘటన ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివాల ప్రాకరం_ _ _ ఫకీర్ మోహన ఆటోనమస్ కాలేజీలో విద్యార్థిని సౌమ్యశ్రీ బిఎడ్ రెండో సంవత్సరం చదువుతోంది. హెచ్ఒడి సమీర్ కుమార్ సాహూ గత కొన్ని రోజుల నుంచి సౌమ్యను లైంగికంగా వేధిస్తున్నారు. అతడి వేధింపులు శృతిమించడంతో కాలేజీ ప్రిన్సిపల్ దిలీప్ ఘోష్‌కు ఫిర్యాదు చేసింది. కానీ ప్రిన్సిపల్ సాహూపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఒత్తిడికి లోనైంది. సెక్సువల్‌గా ఫేవర్‌గా లేకపోతే విద్య పరంగా భవిష్యత్‌ను నాశనం చేస్తానని ఆమెను సాహూ బెదిరించాడు. దీంతో కాలేజీ ఆవరణంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. సహ విద్యార్థులు మంటలను ఆర్పేసి భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. 70 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతోంది. ఆమెను రక్షించడానికి ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా స్వల్పంగా గాయపడింది. ప్రస్తుతం నిందితుడు సాహూను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రిన్సిపాల్ ఘోష్‌ను ఇప్పటికే సస్పెండ్ చేసి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నత విద్యా శాఖ మంత్రి తెలిపారు.





# లష్కర్‌లో వైభవంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

లష్కర్ బోనాల జాతర వైభవంగా కొనసాగుతున్నది. వేకువ జామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పిస్తున్నారు. ఉదయం 4 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ఉజ్జయిని మహాకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతించారు. పెద్ద సంఖ్యలో ఆడపడుచులు అమ్మవారికి బోనం సమర్పించేందుకు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీఎల్ శ్రీనివాస్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, కమిషనర్ ఐ వెంకటరావు, నార్త్ జోన్ డీసీపీ రష్మిక పెర్మల్ భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపడుతున్నారు.





# ఆరో గ్రాండ్‌స్లామ్ నెగ్గిన స్వియాటెక్

వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్ కైవసం చేసుకుంది. మట్టికోర్టు (ఫ్రెంచ్ ఓపెన్) మహారాణిగా గుర్తింపు పొందిన ఇగా.. పచ్చికలోనూ పాగా వేస్తూ తన తొలి, కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్‌ను గెలుచుకుంది. శనివారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో స్వియాటెక్.. 6-0, 6-0తో అమాండ అనిసిమొవ (యూఎస్)పై పూర్తి ఏకపక్ష విజయం సాధించింది. ఏడాదికాలంగా తనకు అచ్చొచ్చిన ఫ్రెంచ్ ఓపెన్‌తో పాటు ఇతర మేజర్ టోర్నీల్లోనూ నిరాశజనక ప్రదర్శనలు చేస్తున్న పోలండ్ బామ.. ఈ ఏడాది ఫస్ట్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలిచింది. 57 నిమిషాల్లోనే ముగిసిన ఫైనల్‌లో స్వియాటెక్ జోరు ముందు అమాండ తేలిపోయింది. ఆరంభం నుంచే తనదైన దూకుడుతో చెలరేగిపోయిన స్వియాటెక్.. 114 ఏండ్లలో ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా దక్కకుండా చేసి రికార్డు విజయం సాధించింది. కోర్టులో పాదరసంలా కదిలిన ఇగా.. తొలి సెట్‌ను 22 నిమిషాల్లోనే ముగించింది. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థిపై సునామీలా విరుచుకపడ్డ ఆమె.. అమాండకు కోలుకునే అవకాశమే ఇవ్వలేదు. సెమీస్‌లో సబలెంకా వంటి బలమైన ప్రత్యర్థిని ఓడించిన అమాండ.. ఫైనల్‌లో కనీసం ప్రతిఘటన కూడా చూపలేదు. 2015, 2016లో సెరెనా విలియమ్స్ బ్యాక్ టు బ్యాక్ టైటిల్స్ గెలిచిన తర్వాత వింబుల్డన్ (ఉమెన్ సింగిల్స్)లో




కొత్త చాంపియన్ అవతరించడం ఇది ఏకంగా 8వ సారి కావడం విశేషం.
ప్రైజ్ మనీ:
విజేత: రూ. 34.8 కోట్లు
రన్నరప్: రూ. 17.64 కోట్లు



# అఖిల్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే

యంగ్ హీరో అక్కినేని అఖిల్ ఒక భారీ హిట్ కోసం ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. 'ఏజెంట్' తర్వాత కొంచెం గ్యాప్ తీసుకొని చేస్తున్న భారీ చిత్రమే లెనిన్. ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నాగార్జున అక్కినేని, నాగవంశీ నిర్మిస్తున్నారు. దర్శకుడు కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమాలో మొదట హీరోయిన్ గా యంగ్ సెన్సేషన్ శ్రీలీల నటించిన సంగతి తెలిసిందే. కానీ ఆమె తప్పుకున్నట్టుగా వార్తలు వచ్చాయి. ఇక దీనిపై లేటెస్ట్ అప్డేట్ తెలిసింది. శ్రీలీల స్థానంలో హీరోయిన్‌గా భాగ్య శ్రీ బోర్సే జూలై 16 నుంచి షూటింగ్ సెట్స్ లో అడుగు పెట్టబోతున్నట్టుగా సమాచారం. ఈ సినిమాకి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నాగార్జున అక్కినేని, నాగవంశీ నిర్మిస్తున్నారు.

